

అప్పాజోస్యుల సత్యనారాయణ

# సైన్స్, సారస్వతాల కలబోత అప్పాజోస్యుల

(రెండవ భాగం)

– మిసిమి

> **అ**ప్పాజోస్యుల సత్యనారాయణ గారు ఒకపక్క సాహిత్యంపై అపార ప్రేమను గుండెల్లో దాచుకుంటూ, ఇంకోపక్క థియరీ ఆఫ్ కంప్యూటర్ ప్రోగ్రామింగ్‌లో అనితరసాధ్యమైన జ్ఞానాన్ని ఆర్జించారు.. ఆయనతో జరిపిన సంభాషణ అనేకమార్లు ఆ అంశాన్ని గుర్తుచేసింది. ఇంకొకటి కూడా చెప్పాలి. ఆయనకు పద్యమంటే మక్కువ. పద్యం వారిలో రసానుభూతిని, భావావేశాన్ని కలిగిస్తుంది..వారిని కదిపితే పద్యప్రపంచంలో విహరించి అలవోకగా పద్యాలు ఆలపిస్తారు. అవి నాటకీయంగా మన కర్ణపుటాలను తాకుతాయి..ఈ సందర్భంగా వారి "సుగుణాఢ్య శతకం" నుంచి పద్యాలు చదివి వినిపించటం విశేషంగా చెప్పాలి. ఈ సంచికలో వారితో జరిపిన సుదీర్ఘసంభాషణ నుండి మిగిలిన భాగాలు మీకోసం.

**మిసిమి : మీరు అజోవిభో సంస్థ తరపున అవార్డులు ప్రదానం చేస్తూ సభలు నిర్వహిస్తున్నారు. 1996లో మీరు విజయవాడలో ఆ కార్యక్రమం నిర్వహించి మధురాంతకం రాజారాం గారికి అవార్డు ప్రదానం చేశారు. ఆ సభలో నేను కూడా ఉన్నాను. వారు తర్వాత మా ఇంటికి వచ్చారు. అలాగే ఇంకోసారి కాకినాడ సభకు వచ్చాను. అప్పుడు బేతవోలు రామబ్రహ్మంగారూ, నేనూ కలిసి వచ్చాము.. అలా ఇంకొన్నిసార్లు కూడా వచ్చాను మీ సభలకు.**

**సత్యనారాయణ :** (నవ్వుతూ) చాలా సంతోషం అశ్వినీ గారు.. 2002 నుంచి మా పంథా మారింది..

**మిసిమి : ఇంకా కాలేదు ఆగండి.. నాటకం, పద్య నాటకం, సాహిత్యంలో అనేక ప్రక్రియలు..అనేక ఊళ్ళు.. ఒక వ్యక్తి చేసేటటువంటి కృషి కాదు.. కానీ ఒక మహత్కార్యంగా భావించాలి.. ఇవన్నీ మీరు ఎలా చేయగలుగుతున్నారు? అసలు అజోవిభో ఫౌండేషన్ మొదలు పెట్టాలని ఎందుకనుకున్నారు?**

**సత్యనారాయణ :** ఫౌండేషన్ మొదలు పెట్టాలని ఎందుకనుకున్నానంటే, తెలుగు సాహిత్యంలో గుర్తింపు పొందని వారు అనేకమంది ఉన్నారు.. ఉదాహరణకి ఈ సంవత్సరం కార్యక్రమం వరంగల్లులో చేయబోతున్నాం.. అక్కడ **గుంజి వెంకటరత్నం** గారు అనే ఆయనకి పురస్కారం ఇవ్వబోతున్నాం. ఆయనకి ఇప్పుడు 88 సంవత్సరాలు.. ఎక్కడో నెల్లూరులో బిఏ చదువుకుని వరంగల్ వచ్చి జీవితాన్ని ఇక్కడే గడిపేసారు.. సాహిత్యంలో ఆయన జరిపినటువంటి కృషిని గనక మనం చూస్తే చాలా ఆశ్చర్యం వేస్తుంది. మహాభారత సర్వస్వము అనేటువంటి పుస్తకం ఆయన వేశారు.. నామవిజ్ఞానం, సూక్తి విజ్ఞానం, శాస్త్రవిజ్ఞానం ఇవన్నీ ఉన్నాయి ఆ గ్రంథంలో.. ఇంకా ఆయన వేసిన పుస్తకాల్లో వరంగల్ విజ్ఞాన సర్వస్వం కూడా ఉంది.. జీవితమంతా టీచర్‌గా గడిపారు.. గొప్ప జీవితం వారిది.. ఇవాల్టికి కూడా ఆయన ఏదో ఒకటి రాస్తూనే ఉంటారు.. ఎమెస్కో సంస్థ వారు ఆయనను గుర్తించి, ఆయన పుస్తకాలు వేసి పెట్టారు. భారతదేశంలో ఇంత గొప్ప ప్రతిభ ఉండి గుర్తింపు లేనివారు చాలా మంది ఉంటారు.. అటువంటి వారిని గుర్తించేందుకు మేం ప్రయత్నం చేస్తున్నాం.. ఆ ప్రాసెస్‌లో మొట్టమొదట నాట్యావధాని ధారా రామనాథశాస్త్రి గారికి సన్మానం చేశాం. ఆయన నాట్యవధానే కాకుండా మంచి పండితుడు మంచి వక్త కూడా. మంచి నటుడు కూడా కానీ ఆయనకు ఏం ఒరిగింది.. ఏమీలేదు.. అలా వారిని గౌరవించే అవకాశం కలిగింది.. మరొకరిని చెప్పుకోవాలంటే కొర్రపాటి శ్రీరామమూర్తి గారు ఎంతటి పండితులు.. శ్రీనాధుని మీద ఎంత గొప్ప వర్క్



సరస్వతి, విశ్వనాథలతో అప్పాజ్యోస్యుల

చేశాడు ఆయన.. ఈ విధంగా గుర్తింపు ఎక్కువగా పొందని వారిని మేము గుర్తించే ప్రయత్నం చేస్తున్నాం.. ఈమధ్యనే తంగిరాల సుబ్బారావు గారిని కూడా సన్మానించే అవకాశం దొరికింది. అలాగే కవి ముకుంద రామారావు గారు కూడా. ఆయన చేసినటువంటి కృషికి ఎటువంటి గుర్తింపు రావాలి .. రాలేదు కదా.. మాకు వారిని సన్మానించుకునే అవకాశం దక్కింది. ఇక్కడ పుట్టి, ఇక్కడ చదువుకున్నాను కదా అందుకని జననీ జన్మభూమిశ్చ స్వర్గాదపి గరీయసి అంటారు కదా.. అందుకే నేను అమెరికాలో ఉన్నా, నా జన్మభూమికి సేవ చేయాలని కోరిక.. అందుకే నేను చదువుకున్నటువంటి స్కూలు మున్సిపల్ హైస్కూల్, ఎన్నార్టీ హైస్కూల్ చాలా దీనావస్థలో ఉంది, పదేళ్ళనాటి మాటనుకోండి..ఆ స్కూలు కూడా ఏదో చేయాలని అనుకున్నాను.. చేశాను (ఇవన్నీ రాయకండని మమ్మల్ని వారించారు). నిజానికి అప్పటి మున్సిపల్ కమిషనర్ నన్ను రిక్వెస్ట్ చేయటం కూడా ఒక కారణం. హెడ్మాస్టర్ గారితో ఒక కమిటీ వేయించి, నేనో ఐదు లక్షలతో ఒక అక్కౌంట్ ఓపెన్ చేయించి, కొంత రిపేర్లు చేయించగలిగాం. నిజానికి ఆ ఐదూ సరిపోలేదు. మరికొంత వేసి కొంత పని చేయించగలిగాను. మనమందరమూ చివరికి చేరుకునే స్మశానం కూడా ఆరామక్షేత్రంగా రూపు దిద్దుకునేందుకు నావంతు సాయం చేశాను. దాన్ని బాగు చేయిస్తూ, మధ్యాహ్నం భోజనం అక్కడే చేసేవాడిని.. అక్కడ చేశారేమిటి అని మీబోంట్లు అడగవచ్చు.. నాకు ఎలాంటి పట్టింపులు లేవు.. ఎక్కడైనా తినగలను (నవ్వు). నలభై ఏళ్ళు అమెరికాలో ఉన్నా, జన్మభూమిని మించింది ఏముంటుంది.. కాస్త మొద్దుగా చెప్పాలంటే, నా ఊళ్ళో నేనుంటే ఫస్ట్ క్లాస్ సిటిజన్‌ని. అదే అమెరికాలో ఉంటే సెకండ్ క్లాస్ సిటిజన్‌ని.

**మిసిమి** : **మీ ఫౌండేషన్ ఎప్పుడు మొదలు పెట్టారు?**

**సత్యనారాయణ :** 1993లోనే రిజిస్టర్ చేసి అక్కడే మొదలు పెట్టాం. మా బ్యాంకు అకౌంట్ కూడా బ్యాంకాఫ్ అమెరికాలో ఉంది. ఇక మా లక్ష్యాలలో ఒకటి చెప్పాను.. రెండవది మంచి పుస్తకాలు ప్రచురించడం. మేమనుకున్న మంచి పుస్తకాలు సుమా.. అదనంగా బుక్ లింక్ ఏర్పాటు చేశాను.. కొనుక్కునేందుకు వీలుగా..

**మిసిమి** : **చాలామంది ఫౌండేషన్ పెట్టి, దాన్నుంచి తమకు గుర్తింపు పొందే ప్రయత్నం చేస్తారు.. మీరు మాత్రం భిన్నం..**

**సత్యనారాయణ :** ఫేం అనేది మనం తెచ్చుకునేది కాదని నేను నమ్ముతాను. మనం చేసే పని మనకు గుర్తింపునిస్తుందని నేను నమ్ముతాను. అందుకే మా ఇన్విటేషన్‌లో మా ఎవరి పేర్లు ఉండవు.

**మిసిమి** : **2002 నుంచి మార్పు తెచ్చామన్నారు..**

**సత్యనారాయణ :** ఆ మార్పు మేము నాటకాల్లో తెచ్చాం. కథని, నాటకాన్ని లింక్ చేయటమెలా అని ఆలోచించాం.. చాలామంది అన్ని కథలూ నాటకానికి పనికిరావన్న అభిప్రాయంలో ఉంటారు. నా ఉద్దేశంలో అలాంటిదేమీ లేదు. ఏ కథనైనా నాటకంగా మార్చుకోవచ్చు. కథలో ఆత్మను చంపేయకుండా నాటకీకరణ సాధ్యమేనని మేం నమ్ముతాం. భాసుడు చేసింది అదేకదా. కాళిదాసుకు అతను గురువు. గురువంటే డైరెక్ట్ గురువు కాకపోవచ్చు. నాకు విశ్వనాథ గురువు.. నన్నయ్య గురువు.. విశ్వనాథ తన అవతారికలో ఛాలెంజ్ చేస్తాడు.. మీకు పురాతన సంస్కృత, తెలుగు గ్రంథాల గొప్ప సాహిత్య స్పృహ మీకు కలగాలంటే, ఉదాత్తమైన కల్పనంటే ఏమిటో మీకు తెలియాలంటే, నా దగ్గరకు రా నాయనా, నా రామాయణం చదువు నాయనా అంటాడు.

**ఎదకు పురాంధ్ర సంస్కృత కవీశ్వర భారతి దీప్తికలిగినన్/సదమల బుద్ధికిన్ బహుళశాస్త్ర రహస్య వివేకమబ్బినన్/ మదికి ఉదాత్త కల్పనల మక్కువ కల్గినన్ విశ్వనాథ శా/రద సకలార్థదాయిని సురద్రువు రామకథను భజింపుము.**

ఎంత ఆత్మ విశ్వాసము ఉండాలి, ఇలా చెప్పాలంటే.. అలా నన్నయ్యకు లేదు, తిక్కనకు లేదు ఆ భోగము అన్నాడు కూడా విశ్వనాథ.. దేని గురించి.. చెళ్ళపిళ్ళకు ఉన్న శిష్యుడు వీరికున్నాడా అంటాడు.. అంటే ఎవరు.. తన గురించి

తాను చెప్పుకున్న విశ్వనాథ పద్యం గుర్తుంది కదా.. విశ్వనాథ గురించి చెప్పుకుంటుంటే అంతు ఉండదు కానీ, మీరు ఫౌండేషన్ గురించి అడిగారు.. తొంభైలు వచ్చే నాటికి నాకుటుంబం సెటిల్ అయింది.. నా రీసెర్చ్ కార్యక్రమాలు తగ్గించుకుంటూ సాహిత్యం వైపు మొగ్గు చూపుతుండగా అప్పుడే తానా సభలు జరిగాయి. ఆ సభలకు **ప్రసాదరాయ కులపతి, ధారా రామనాథశాస్త్రి, ముదిగొండ శివప్రసాద్** వంటి పెద్దలొచ్చారు. నేను కూడా తానా సభల్లో చాలా చురుకుగా పాల్గొంటుండేవాడిని. అప్పుడు వీరంతా భువన విజయం ప్రదర్శించారు.. మేము కుందేలు కొమ్ము నాటకం ప్రదర్శించాం. అక్కడ ఇలా వచ్చినవారిని గెస్ట్‌లుగా కొందరికి కేటాయిస్తారు. అప్పటి తానా అధ్యక్షుడు నాకు ఫోన్ చేసి (పేరు మర్చిపోయాను.. మన్నించాలి) మీకేమైనా కుదురుతుందా వారికి ఆతిథ్యమివ్వటానికి అన్నాడు.. అయ్యో తప్పకుండా పంపించండని చెప్పాను.. మొత్తం ఎనిమిది మందీ వచ్చారు. ధారా రామనాథశాస్త్రి మాకు దూరపు బంధువు. ప్రసాదరాయ కులపతి గారు చాలా సాత్వికంగా ఉన్నారు.. బేలన్స్‌డ్‌గా మాట్లాడతారు.. ఆయనతో ఎక్కువసేపు గడిపేవాడిని. ఫౌండేషన్ గురించి నా ఆలోచన ఆయనకు చెప్పాను.. ఆయన ఎంత బేలన్స్‌డ్‌గా చెప్పారంటే, సరే మంచివాళ్ళెవరయినా దొరికితే మొదలుపెట్టండి అన్నారు. ఆయనే మాకు మేనేజింగ్ ట్రస్టీ అయ్యారు. ఆయన కుర్తాళం పీఠాధిపతి అయ్యేంతవరకు ఆయనే ఉండేవారు. అయిన తర్వాత కూడా విశాఖపట్నంలో మీటింగ్ పెడితే ఆయన కుర్తాళం నుంచి వ్యాన్‌లో వచ్చారు. మా సంస్థకు అజో–విభో అన్న పేరు పెట్టింది తిరుమల రామచంద్ర గారు.. ఆయన వ్యాసం కూడా మా మొదటి సంచికలో ఉంది. ఇప్పుడు వరంగల్‌లో జరగబోయే సభ ముప్పై మూడవది. ఇప్పటివరకు బ్రేక్ లేకుండా సభలు నిర్వహించాం.. కరోనా సమయంలో కూడా సభని నిర్వహించాం.

**మిసిమి : ఈ సభలకు మీరు ఎంత ఖర్చు పెడతారు చెప్పండి..?**

**సత్యనారాయణ :** సభకి సంబంధించినంత వరకు 12 లక్షల రూపాయలు ఖర్చు అవుతుంది.. పూర్వం అంత లేదు. ఇప్పుడు అన్ని ఖర్చులు పెరిగిపోయాయి కదా, అందుకని మా ఖర్చు కూడా పెరిగింది (నవ్వు). వచ్చిన వాళ్ళందరికీ వసతి భోజన సదుపాయాలు కల్పిస్తాం. స్టేజిపై మాట్లాడిన వారందరికీ కొంత పారితోషకం కూడా ఇస్తాం.

**మిసిమి : ఇంత పెద్ద సభను నిర్వహించాలంటే మనుషులు కావాలి. అది మీరు ఎలా చేయగలుగుతున్నారు..?**

**సత్యనారాయణ :** మంచి ప్రశ్న వేశారు.. ఈ సభల ద్వారా మాకు మంచి మిత్రులు ఏర్పడుతున్నారు.. వారే వాలంటీర్లుగా వచ్చి మాకు తోడ్పడుతున్నారు..1995లో విశాఖపట్నంలో సభ జరిపినప్పుడు అక్కడ మాకు కృష్ణ ప్రసాద్ పరిచయం అయ్యాడు.. అతను ఫార్మసిస్టు.. అప్పటినుంచి ఇప్పటివరకు ప్రతి సభకు అతను హాజరవుతాడు.. తన సేవలు అందిస్తాడు. ఈ విధంగా ప్రతి సభలోను మమ్మల్ని అభిమానించి ఈ కార్యక్రమంలో పాల్గొనటానికి వచ్చే వాళ్ళు ఉన్నారు కొంతమంది నా మిత్రులు ఉన్నారు.. డిఎస్ఎన్ మూర్తి ఉన్నాడు.. అతను నా క్లాస్మేట్.. అలాగే రామకోటేశ్వరరావు ఉన్నాడు.. వీళ్లు వస్తారు పార్టిసిపేట్ చేస్తారు వెళ్తారు..కానీ మిగిలిన వాలంటీర్స్‌కి వాళ్ళ ఖర్చులు మేము చూసుకుంటాం.. ఇంకోటి.. లోకల్‌గా ఉండేటటువంటి సంస్థలు మాకు సహాయపడతాయి.. వరంగల్ ఉంది. అక్కడ సహృదయ సంస్థ ఉంది, వారి సహకారం మాకు ఉంది.. ఏర్పాట్లు వారు చూస్తారు.. ఖర్చులు మేము చూస్తాం.. ప్రతి సంవత్సరం జనవరి నెల మొదటి గురువారం సభ చేస్తాం, తర్వాత శుక్ర శని ఆది ఈ మూడు రోజుల్లోనూ సభలు జరుగుతాయి.. ఉదాహరణకు గురువారం ఒక సభ జరుగుతుంది.. శుక్రవారం నాడు రెండు సభలు ఉంటాయి. ఈ సభలన్నిటికీ అనేక బ్యానర్లు అవసరం అవుతాయి.. ఆ బ్యానర్లు, బ్యాడ్జీలు అవన్నీ మేమే తీసుకొస్తాం.. ఉదయం సభ వేరు.. సాయంత్రం సభ వేరు.. సో రెండు సభలకి రెండు బ్యానర్లు అవసరం.. ఈ ఏర్పాట్లు మేము చూస్తాం.ఈ నాలుగు రోజులకు కలిపి ఏడుసెషన్లు ఉంటాయి. ఇక నాటకాలకు సంబంధించి జూన్‌లోనే ప్రకటన ఇస్తాం.. పోటీ నాటకాలు కావాలంటూ.. మేము పెట్టిన నిబంధన ఏమిటంటే పబ్లిష్ అయిన కథను మాత్రమే తీసుకోవాలి.. ఆ కథని మీరు నాటకంగా మార్చుకోవాలి.. చిన్న చిన్న మార్పులు ఇబ్బంది లేదు.. నాటకం సంబంధించి ఒక ఫారమ్ ఉంటుంది .. వాళ్ళు దాన్ని నింపి, దాని ప్రకారం నాటకాన్ని తయారు చేసుకుంటారు.. ఈ సంవత్సరం 30 ఎంట్రీలు వచ్చాయి. మళ్లీ ఈ 30 నాటకాలలో 22 నాటకాలు స్క్రూటినీకి వచ్చాయి. ఇద్దరు ప్రాథమిక పరిశీలకులు ఉంటారు. ఈసారి గోపరాజు విజయ్, ఈవీ రమణ పరిశీలకులుగా వ్యవహరించారు.

వీటిలోంచి గరిష్టంగా 9 నాటకాలు, కనిష్టంగా ఆరు నాటకాలు ఎంపిక చేస్తారు. ఇక్కడ ప్రదర్శించే నాటకాలు ఇంతకుముందు పోటీలో పాల్గొని ఉండకూడదు.. అంటే కొత్త నాటకం మాత్రమే ఇక్కడ ప్రదర్శించాలి. గురువారం నాడు మూడు నాటకాలు ఉంటాయి.. అలాగే శుక్రవారం, శనివారం మూడు మూడు నాటకాలు ఉంటాయి.. ఆదివారనాడు ప్రతిభామూర్తి పురస్కారసభ ఉంటుంది. లక్షరూపాయలు పురస్కార నగదుగా ఇస్తాం.. దానితోపాటు కృషి సమాలోచన సదస్సు ఉంటుంది. ప్రతిభామూర్తి పురస్కారం ఎందుకు ఇస్తున్నామో చెప్పవలసిన బాధ్యత మా మీద ఉంటుంది కదా.. అందుకని ఈ క ృషి సదస్సు అన్నమాట. దీంతోపాటుగా "సరిలేరు నీకెవ్వరు– విశిష్ట రంగస్థలం" పురస్కారం ఉంటుంది. కొన్ని ఊళ్ళల్లో ఈ సభలు రెండుసార్లు చేయడం జరిగింది. అలా తెనాలిలో 2004, 2019 సంవత్సరాల్లో నిర్వహించాము. అలాగే విజయవాడ, విశాఖపట్నం, వరంగల్, గుంటూరు.. ఈ నగరాల్లో కూడా రెండుసార్లు సభలు నిర్వహించాం.. అదే హైదరాబాదులో మూడుసార్లు నిర్వహించాం. తిరుపతిలో సభ చేశాం.. అనంతపూర్‌లో సభ చేశాం కర్నూల్‌లో చేయలేదు.. మేము చింత పడుతుంటే మాకు ఎవరో ఆహ్వానం పలికారు.. వచ్చే సంవత్సరం కర్నూలులో చేస్తామేమో.. నెల్లూరు, కడప ఈ నగరాల్లో సభలు చేశాం.. ఒంగోలులో చేద్దాం అంటే మంచి నాటక ప్రదర్శనశాల లేదు.. నిజామాబాద్‌లో సభ చేసాం.. కరీంనగర్లో చేయాలి.. కరీంనగర్ అంటే పి.వి.నరసింహారావు గారికి ప్రతిభా పురస్కారం ప్రదానం చేసినప్పుడు ఆ సభ అక్కడే అనుకున్నాం కానీ అవలేదు. అసలు ఆయన్ని ఒప్పించటానికి చాలా కష్టపడాల్సి వచ్చింది. మీ అమెరికా వాళ్ళా.. వద్దు, మీ అమెరికా వాళ్ళ వలన నామీద బోల్డు కేసులున్నాయన్నారాయన. లేదండీ మీమీద అంటే మీ సాహిత్య కృషి మీద వేయి పేజీల పుస్తకం వేస్తాం తెలుగు, ఇంగ్లీష్ భాషల్లో అంటే ఆయన మెత్తబడ్డాడు. తర్వాత ఆశ్చర్యపోయారు.. ఆయన అమెరికా వచ్చినప్పుడు నాకు ఫోన్ చేసి నన్ను పిలిచారు. అప్పుడు కలిసినప్పుడు, నెక్స్ట్ ట్రిప్‌లో మీ ఇంటికి వస్తానని ప్రామిస్ చేశారు. కానీ ఆయన మళ్ళీ రాలేదు. ఆ తర్వాతి సంవత్సరంలో ఆయన శివైక్యం చెందారు.

**మిసిమి** : **ఆయన బెజవాడ వచ్చినప్పుడు ఆయన్ని కలిశాను. నా పుస్తకాలిచ్చాను.. అవి చదివి ఫోన్ చేశారు. ఆయన వొరేషియస్ రీడర్.**

**సత్యనారాయణ :** అవునా.. అయితే మీరదృష్టవంతులు. ఇంకోవిషయమేమిటంటే పి.వి.గారికి విశ్వనాథ వారంటే ఎంతో గౌరవం. ఆయన ముఖ్యమంత్రిగా ఉన్న కాలంలో విశ్వనాథ వారిని చూడటానికి వెళ్తూ, కారెక్కడో దూరంగా ఆపి, ఆపై నడుచుకుంటూ వెళ్ళేవారు.

**మిసిమి** : **అనేక ఊళ్ళలో అజోవిభో –కందాళై ఫౌండేషన్ సభలు పెట్టడానికి కారణం?**

**సత్యనారాయణ :** మేము ఒకేచోట ఈ సభలు పెట్టకుండా అనేక ఊర్లలో పెట్టడానికి కారణం ఏమిటంటే, ఎవరైతే మరుగునపడి ఉన్నారో ఆ ప్రతిభాశాలురకు అవార్డు ఇవ్వాలి అన్నది మా తాపత్రయం. మేము ఎక్కడైతే సభ నిర్వహిస్తున్నామో, అక్కడి రెండు జిల్లాల వారి నుంచే ప్రతిభాశాలురను ఎంపిక చేసుకుంటాం..

**మిసిమి** : **నిజానికి ప్రతిభ ఉండి అవకాశాలు లేని వారికి మీరు గొప్ప అవకాశం ఇస్తున్నారు..**

**సత్యనారాయణ :** అవకాశం పెద్ద మాట కానీ నేను చేయగలిగింది ఏదో చేస్తున్నాను.. అలాగే మేము నిర్వహించే నాటికల పోటీలు అవి చాలా ఉపయోగకరంగా ఉంటున్నాయని మాకు తెలుస్తోంది.. ఎందుకంటే ఇక్కడ నాటకం ప్రదర్శిస్తే, ఆ నాటకానికి మంచి గుర్తింపు వస్తోంది.. అది మాకు సంతోషాన్ని ఇచ్చేటువంటి విషయం. రిజెక్ట్ అయినవాళ్ళు ఒక మాట చెబుతారు. మీదగ్గర సెలెక్ట్ అయితే, ఐఎస్ఐ మార్కు లాంటిదని.. పరిషత్ నాటకాలకు మాది గేట్ వే అంటాను.. మా మీద మొదట్లో ఒత్తిడులుండేవి. తర్వాత ఇది దున్నపోతు వ్యవహారం అని వాళ్ళకర్థమయింది (నవ్వు)..

**మిసిమి** : **పంచవటి శతకం తెచ్చారు కదా. మీ పుస్తకాలు తెచ్చే ప్రయత్నంలో ఉన్నారా?**

**సత్యనారాయణ :** అవునండీ పంచభూతాలపై శతకం అది.. ఏమయినా రచన చేయాలంటే ఒక సమాధి స్థితి కావాలి. వస్తువు దొరకాలి.

**మిసిమి** : **మీరు చాలా చదివారు. చాలా జీవితాన్ని చూశారు! మీకు వస్తువు కొరతేముంది. మీ జీవిత చరిత్రే రాయొచ్చు కదా..**

**సత్యనారాయణ :** మీరన్నది నిజమే. చాలామంది నన్ను పోరుతూ ఉంటారు. మీరెందుకు మీ ఆత్మకథ రాయరూ అంటూ. అమెరికాలో తిరుపతి రెడ్డి గారని ఒకాయన ఉన్నారు. నా రచనల గురించి అడుగుతూనే మూడువేల డాలర్లు నా అక్కౌంట్‌లో వేసేస్తుంటాడు.. ఎప్పుడైనా ఆయనదో పుస్తకం వేస్తాం.. ముప్పైవేల రూపాయలవుతే మాకు మూడులక్షలిస్తాడని స్టేజ్ మీద చెబుతుంటాను.. ఒకసారి కలిశపూడి శ్రీనివాసరావు మా ఆఫీసుకు వచ్చి లక్షరూపాయలు పెట్టేసి వెళ్ళిపోయాడు. ఎందుకయ్యా అన్నాను. సద్వినియోగం కోసం అన్నాడు.. అదతని ప్రేమ.. అంతకంటే ఏం చెప్పగలను. సంవత్సరానికి ముప్పైలక్షలు మాకయ్యే ఖర్చు. ఇందులో నాలుగు రోజుల సభకు పన్నెండు లక్షలు. మిగిలినది పుస్తకాల ప్రచురణకు, గుప్త దానాలకు అన్నింటికీ కలిపి. (నవ్వు). తెనాలిలో బుర్రా సాయి మాధవ్ నాలుగు రోజుల పాటు కళల కాణాచి పండగ చేసి ముప్పైలక్షలు ఖర్చుపెడతాడు. అవార్డు వాళ్ళకి, ఒక్కొక్కరికి యాభై వేలిస్తాడు. అతనికి తెనాలిలో ఒకాయన పదిలక్షలిస్తాడు. సినిమా వాళ్ళో పదిలక్షలు ఇస్తారు. నేనో రెండు లక్షలిస్తాను..చెప్పాకదా. మా ఊళ్ళో మరుభూమికి పదిలక్షలిచ్చాను.. ఈవిధంగా నేను చేసే ఖర్చు ఉంటుంది (నవ్వు)

**మిసిమి : ఎనభై రూపాయలకు మీరు ఉద్యోగం చేశారు. ఆ దశ దాటి గత ముప్పై సంవత్సరాల్లో.. సంవత్సరానికి ముప్పైలక్షలు మీ అభిరుచి కోసం ఖర్చు పెడుతున్నారు.. మీ జీవితంలో ఎంతో వేరియేషన్ వుందనిపిస్తోంది.. మీరు సెల్ఫ్‌మేడ్ వ్యక్తి.. అలాంటి వాళ్ళు ఊరికినే ఖర్చు పెట్టడానికి ఇష్టపడరని అర్థమవుతుంది..**

**సత్యనారాయణ :** మనం గమనిస్తే, మనచుట్టూ ఉన్న చాలామందిలో స్థలాలను ఆక్రమించేవాళ్ళే ఎక్కువుంటారు.. కాలాన్ని ఆక్రమించే తిక్కన లాంటి వారు తక్కువ మంది ఉంటారు. ఆయన ముందు నేనెంత. ఒక అల్పుణ్ణి. తిక్కన మహామంత్రి కదా.. ఆయనకన్నా ముందు ఎంతోమంది మంత్రులున్నారు. కానీ ఆయన తన జీవితంలో సింహ భాగాన్ని మహాభారత రచనకు వెచ్చించాడు. పదిహేనువేల పద్యాలు రాసిన ప్రాచీనాంధ్ర నిర్మాత తిక్కన మహాకవి. విశ్వనాథ వంటి రచయిత మనకు దొరుకుతాడా.. చెళ్లపిళ్ల శిష్యుడనేనని ఎంత గొప్పగా చెప్పుకుంటాడు.. నిజానికి కాటూరి, పింగళి.. ఇద్దరూ చెళ్లపిళ్ల వెంకటశాస్త్రి గారి డైరెక్ట్ శిష్యులు. విశ్వనాథ కాదు.

**మిసిమి : కానీ విశ్వనాథ వారి రచనల్లో ఓ చిలిపిదనం ఉంటుంది..**

**సత్యనారాయణ :** దానితోపాటు చక్కటి హాస్యం కూడా ఉంటుంది. రామాయణ కల్పవృక్షంలో దాన్ని మనం చూడొచ్చు..

**మిసిమి : మీరు ఎంతో విస్తృతంగా ఈ సాహిత్య ఉత్సవం చేస్తున్నారు కదా.. సంవత్సరంలో ఎప్పటి నుంచి ఈ ప్రాసెస్ మొదలు పెడతారు.?**

**సత్యనారాయణ :** ప్రతి సంవత్సరం జూన్ మాసం నుంచి మొదలు పెడతాం. జూన్ కల్లా ఎక్కడ చేస్తున్నామో ఆ స్థలం అంటే ఊరు ఖరారయిపోతుంది. ఇక ఆ చుట్టు పక్కల జిల్లాల్లో ఉన్న గొప్ప వారిని వెతికి షార్ట్ లిస్ట్ చేస్తాం. ముగ్గురుని ఎంపిక చేస్తాం. ఆ ముగ్గురిలో నుంచి ఒకరి ఎంపిక కోసం, జడ్జీల ప్యానెల్ లాంటిది పెట్టుకుంటా.. మీతో మాట్లాడినట్లు ఇన్ఫార్మల్‌గా మాట్లాడతా. వారితో అలా మాట్లాడితే ఎవరిని ఎంపిక చేయాలో అర్థమవుతుంది. (నవ్వు) ఇక జనవరి నుంచి జూన్ వరకు ఖాళీగా ఉండే సమయంలో నాలుగు వారాలపాటు పిల్లల దగ్గర ఉంటాను.. ఈ ఆర్నెల్లు కాలంలో ఏం పుస్తకాలు వేయాలో నిర్ణయించుకుంటాను..

**మిసిమి : ఈ కార్యక్రమాలు ఎంత కాలం చేస్తారు.. ఓపికున్నంతవరకూ చేస్తారా?**

**సత్యనారాయణ :** ఓపికున్నంతవరకూ కాదు. చచ్చేంతవరకూ చేస్తాను. మా పిల్లలు ఎందుకిలా ఖర్చు పెడతావు.. అవసరమా! అని నన్నడగలేదు. వాళ్ళు నాగురించి ఆయన సంతోషం.. ఆనందం ఆయనది అనుకుంటారనే అనుకుంటాను. పుస్తకాలు వేస్తానని తెలుసు కానీ, రాస్తానని మా పిల్లలకు తెలియదు.. మా ఆవిడకు కూడా అంతే తెలుసు. ఇంకో విషయం చెప్పమంటారా.. మన పిల్లలు మనకన్నా తెలివైన వాళ్ళు. ఇది మనం తెలుసుకుని మెలగాలి. మా పెద్దబ్బాయి ఒక యూదుల అమ్మాయిని చేసుకున్నాడు. రెండో అబ్బాయి గుజరాతీ అమ్మాయిని చేసుకున్నాడు.. మా అమ్మాయి అందరిలోకి చిన్నది.. రాజస్థానీ డాక్టర్‌ని చేసుకుంది. అందరివీ ప్రేమ వివాహాలే.. అమెరికాలో మనం సంబంధాలు చూసి చేయటం సాధ్యం అయ్యే పనికాదు. అదేకాదు పిల్లల జీవితాల్లో మనం చొరపడకూడదని నేను బలంగా నమ్ముతాను. నాకు మా అమ్మలానే.. ఉపనిషత్తుల్లో చెప్పినట్లు డిటాచ్‌మెంట్ అలవాటు